# నత్తనడకన కేంద్రం..

- ప్రాజెక్టుల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ అలసత్వం
- డెడ్‌లైన్ దాటిపోయిన 48% కేంద్ర ప్రాజెక్టులు
- ఖజానాపై రూ.5 లక్షల కోట్లు అదనపు భారం
- తెలంగాణలో జెట్ స్పీడ్‌తో ప్రాజెక్టుల నిర్మాణం


# జెట్ స్పీడ్‌తో తెలంగాణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల నిర్మాణంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తున్నది. దాదాపు 48 శాతం కేంద్ర ప్రాజెక్టులో వాటి నిర్మాణానికి పెట్టుకొన్న డెడ్‌లైన్‌ను ఇప్పటికే దాటిపోయాయి. బీజేపీ సర్కారు ఉదాసీనత కారణంగా ఖజానాపై రూ.5 లక్షల కోట్ల మేర అదనపు భారం పడుతున్నది. దేశ ప్రజల సొమ్మును ఈ విధంగా వృథా చేయడంపై మోదీ సర్కార్ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గత తొమ్మిది న్నరేండ్ల కాలంలో కేంద్రం పరిధిలోని రూ.150 కోట్ల పైబడిన 1,763 మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో 842 ప్రాజెక్టుల నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. ఇప్పటికే గడువు



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు వెట్‌రన్ నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)



పూర్తయినప్పటికీ, వీటి నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. దీంతో రూ.4.77 లక్షల కోట్ల ప్రజాధనాన్ని అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ మేరకు కేంద్ర గణాంకాల శాఖ తాజా నివేదికలో వెల్లడించింది. 1,763 ప్రాజెక్టుల నిర్మాణం కోసం వాస్తవానికి రూ.24.86 లక్షల కోట్లు వెచ్చించాల్సి ఉన్నది. అయితే, గడువు ముగిసిన కారణంగా వీటి వ్యయం రూ.29.64 లక్షల కోట్లకు చేరుకొన్నట్టు నివేదిక వెల్లడించింది. గడువు దాటిన ప్రాజెక్టుల్లో ఎక్కువ శాతం ప్రాజెక్టులు రోడ్లు, హైవే మంత్రిత్వ శాఖ పరిధిలోనివి కాగా, అదనపు వ్యయం ఎక్కువగా చెల్లించాల్సిన ప్రాజెక్టులు రైల్వే శాఖ పరిధిలోనివిగా ఉన్నాయి.

**తెలంగాణలో సకాలంలో ప్రాజెక్టుల నిర్మాణం**

చేపట్టిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడంలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. గడిచిన తొమ్మిదిన్నరేండ్ల కాలంలో 3 భారీ ప్రాజెక్టుల నిర్మాణ పనులను నిర్మించడం విశేషం. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకంగా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం మూడేండ్ల వ్యవధిలోనే పూర్తి చేశారు. నిపుణుల అంచనా ప్రకారం.. కాళేశ్వరం ప్రాజెక్టును ఇప్పటి వరకూ పూర్తిచేయకపోతే, ప్రస్తుతం పెరిగిన స్టీల్, డీజిల్, సిమెంట్, ఇసుక, భూమి ధరల కారణంగా ప్రాజెక్టు వ్యయం మూడు రెట్లు పెరిగేది. ఇక, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 2015లో చేపట్టింది. కోర్టు కేసులు, కరోనా నేపథ్యంలో ప్రాజెక్టు పనులు దాదాపు 4 ఏండ్లకు పైగా నిలిచిపోయాయి. అయినప్పటికీ, యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులను ఓ కొలిక్కి తీసుకొచ్చిన బీఆర్ఎస్ సర్కార్.. ఇటీవలే ప్రాజెక్టు వెట్ రన్‌ను ప్రారంభించి, అంజనగిరి రిజర్వాయర్‌ను నింపింది. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం సమీకృత సీతారామ ప్రాజెక్టును చేపట్టింది. సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మాణం కొనసాగుతుండగా, ఎత్తిపోతలకు సంబంధించి నిర్మాణ పనులు తుది దశకు చేరుకొన్నాయి. ఉమ్మడి రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యంతో దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉండిపోయిన కృష్ణా, గోదావరి బేసిన్‌లోని పలు ప్రాజెక్టులను కూడా కేసీఆర్ ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తిచేస్తున్నది.

## అన్నింటా మధ్యప్రదేశ్ అట్టర్‌ఫ్లాప్!

### అన్ని ర్యాంకుల్లో తెలంగాణ కంటే వెనుకే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్‌లో సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ పని తీరు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ విజయావకాశాలను దెబ్బతీసే విధంగా మారాయి. ప్రభుత్వ వైఫల్యాలు ప్రతిపక్షాలకు ఎన్నికల ఆయుధాలుగా మారాయి. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాల సూచీల్లో మధ్యప్రదేశ్ అట్టడుగు స్థానంలో ఉన్నది. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ చాలా రంగాల్లో మెరుగైన ఫలితాలతో అగ్రభాగాన నిలుస్తున్నది. ఈ విషయాన్ని తెలంగాణ ఆర్థిక సర్వే నివేదిక స్పష్టంగా చెబుతున్నది. అదే విధంగా మధ్యప్రదేశ్ ఆర్థిక సర్వే ఆ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వానంగా ఉందో చెప్పకనే చెబుతున్నది. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారుంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పుకునే బీజేపీ నేతలు దీనికి ఏం సమాధానం చెబుతారని మధ్యప్రదేశ్ ప్రజలు నిలదీస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.




**ప్రభుత్వాల పనితీరు ఇలా..**

| క్యాటగిరీ | మధ్యప్రదేశ్ | తెలంగాణ |
|---|---|---|
| శిశుమరణాలు (ప్రతి వెయ్యి మందికి) | 43 | 21 |
| బాల్య వివాహాల శాతం (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-4 రిపోర్టు) | 32.4 | 22.6 |
| పారిశుద్ధ్యం | 26వ ర్యాంకు | స్వచ్ఛభారత్‌లో ఫస్ట్ ప్రైజ్ |
| తలసరి ఆదాయం | 21వ ర్యాంకు | ఫస్ట్ ర్యాంకు |



## వినోద్ అదానీకి సైప్రస్ గోల్డెన్ పాస్‌పోర్ట్

మరో 66 మందికి కూడా..

**వీరిలో చాలా మంది దేశంలో విచారణ ఎదుర్కొంటున్నవారే**

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి ఆప్తుడు గౌతం అదానీ సోదరుడు.. వినోద్ అదానీ సైప్రస్‌లో పలు ఆఫ్‌షోర్ కంపెనీలు నడుపుతున్నాడని, 66 మంది భారతీయ వ్యాపారవేత్తలకు సైప్రస్ 'గోల్డెన్ పాస్‌పోర్ట్' లభించిందని ఆంగ్ల దినపత్రిక తాజాగా వార్తా కథనం వెలువరించింది. 2007లో సైప్రస్ ప్రభుత్వం 'గోల్డెన్ పాస్‌పోర్ట్ పథకం' తీసుకొచ్చింది. ఆ దేశ పౌరసత్వం పొందేందుకు ఇది వీలు కల్పిస్తుంది. భారత్‌లోని ఆర్థిక నేరగాళ్లు, పన్ను ఎగవేతదార్లను పెద్ద సంఖ్యలో ఆకర్షించింది. ఈ పథకం ద్వారా 'గోల్డెన్ పాస్‌పోర్ట్' పొందినవారిలో.. వినోద్ అదానీ, పారిశ్రామికవేత్త పంకజ్ ఒస్వాల్, ఆయన భార్య రాధికా ఒస్వాల్, క్రిమినల్ నేరారోపణలు ఎదుర్కొంటున్న యూపీ వ్యాపారవేత్త విర్కారన్ అవస్తీ, ఎంజీఎం మారన్, సురేంద్ర హిరానీ.. తదితరులు ఉన్నట్టు వార్తా కథనం పేర్కొన్నది. వినోద్ అదానీ విదేశాల్లో ఆఫ్‌షోర్ కంపెనీలు నడుపుతున్నాడని హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపించగా, అదానీ కంపెనీ ఆ ఆరోపణల్ని ఖండించింది. తాజా కథనంతో హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిజమేనన్న అనుమానాలు కలుగుతున్నాయి.

**విదేశాలకు తరలిన ప్రజల సొమ్ము: రాహుల్‌గాంధీ**

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ స్పందిస్తూ, 'వినోద్ అదానీ సహా 66 మంది భారతీయ వ్యాపారవేత్తలు భారత్ నుంచి సైప్రస్‌కు తమ పెట్టుబడుల్ని తరలించారు. ప్రజల సొమ్మును దొంగలించడానికి వారికి దొరికిన బంగారంలాంటి పథకం ఇది' అని అన్నారు. 'ప్రజల సొమ్ము షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలింది' అని ఎక్స్‌లో సందేశాన్ని పోస్ట్ చేశారు.

## సూపర్‌బ్లడ్‌తో నా తండ్రి వయసు తగ్గించా!

**బిలియనీర్ బ్రియాన్ జాన్సన్**

శాన్‌ఫ్రాన్సిస్కో, నవంబర్ 15: టీనేజ్‌లో ఉండే ఉత్సాహం, శారీరక పటుత్వం.. వయసు పైబడ్డాక ఉండదు. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు అమెరికాలోని సాఫ్ట్‌వేర్ బిలియనీర్ బ్రియాన్ జాన్సన్ వివాదాస్పద 'మెడికల్ థెరపీ'ని తీసుకుంటున్నారు. ఇందుకోసం ఆయన ఏటా 2 మిలియన్ డాలర్లకుపైగా ఖర్చు చేస్తున్నారు. తాజాగా ఆయన సంచలన ప్రకటన చేశారు. తన సూపర్ బ్లడ్ (ప్లాస్మా)తో తన తండ్రి(71) వయసును 25 ఏండ్లు తగ్గించినట్టు తెలిపారు. 'నా రక్తంలోని ఒక లీటర్ ప్లాస్మాను మా నాన్నకు మార్పిడి చేశాను. దీంతో నా తండ్రి వయసు 25 ఏండ్లు తగ్గింది. ఇప్పుడు నా తండ్రి 46 ఏండ్ల వయసు వ్యక్తిలా ఉన్నారు' అని పేర్కొన్నారు.

## సిరియా అధ్యక్షుడిపై ఫ్రాన్స్ అరెస్ట్ వారంట్

పారిస్, నవంబర్ 15:యుద్ధ నేరాలకు పాల్పడ్డారనే అభియోగాలపై సిరియా అధ్యక్షుడు బషర్ అషద్, అతని సోదరుడు, మరో ఇద్దరు ఆర్మీ జనరల్స్‌పై ఫ్రెంచ్ న్యాయస్థానం బుధవారం అంతర్జాతీయ అరెస్ట్ వారంట్‌ను జారీ చేసింది. దౌమా, తూర్పు గౌతా ప్రాంతాల్లో తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న డమస్కస్ సబర్బన్ ప్రాంతాలపై 2013 ఆగస్టులో రసాయన ఆయుధాలతో జరిపిన దాడుల్లో వెయ్యి మంది మృతి చెందగా, వేలాది మంది గాయపడ్డారు. ఈ దాడిలో మృతి చెందిన కుటుంబ సభ్యులు, బాధితులతో పాటు సిరియన్ సెంటర్ ఫర్ మీడియా అండ్ ఫ్రీడమ్ ఎక్స్‌ప్రెషన్ (ఎస్‌సీఎం) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్రాన్స్‌లోని సారస్వత అధికార పరిధిలో ప్యారిస్ జ్యుడీషియల్ కోర్టు 2021లో విచారణ ప్రారంభించింది. సిరియా అధ్యక్షుడు అషద్‌తో పాటు ఆయన సోదరుడు మహెర్ అషద్, మరో ఇద్దరు జనరల్స్ ఈ దాడులకు బాధ్యులని ప్యారిస్ జ్యుడీషియల్ కోర్టు నిర్ధారించింది. ఈ చర్య ద్వారా వారు యుద్ధ నేరాలకు పాల్పడ్డారని పేర్కొంటూ అంతర్జాతీయ అరెస్ట్ వారంట్‌ను జారీ చేసింది.

## ఎంబీబీఎస్ సీట్ల పరిమితిపై కేంద్రం వెనుకడుగు!

- దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా నిలిపివేత
- అందరినీ సంప్రదించి 2025-26లో అమల్లోకి తెస్తామని ఎన్‌ఎంసీ వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 15: దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో ఎంబీబీఎస్ సీట్ల పరిమితిపై కేంద్రం వెనుకడుగు వేసింది. మూడు నెలల క్రితం (ఆగస్టు16న) విడుదల చేసిన నూతన మార్గదర్శకాల అమలును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు 'నేషనల్ మెడికల్ కమిషన్'(ఎన్‌ఎంసీ) బుధవారం ప్రకటించింది. 'ఎంబీబీఎస్ సీట్ల పరిమితిపై వివిధ వర్గాలతో సంప్రదింపులు జరుపుతాం. ఈ అంశంపై ఏకాభిప్రాయం రాగానే, 2025-26 నుంచి అమల్లోకి తీసుకొస్తాం. అప్పటివరకు కొత్త గైడ్‌లైన్స్ అమలును ఆపేస్తున్నాం'అని ఎన్‌ఎంసీ తాజాగా వెల్లడించింది. ఆగస్టు 16న ఎన్‌ఎంసీ జారీచేసిన గైడ్‌లైన్స్‌పై దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతి 10 లక్షలమంది జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండాలని, పరిమితి మించితే కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతించమంటూ ఎన్‌ఎంసీ జారీ చేసిన ఆదేశాలు వివాదాస్పదమయ్యాయి. ఈ నిర్ణయంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎన్‌ఎంసీ మార్గదర్శకాలు అమల్లోకి వస్తే, ఆయా రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ సీట్ల పెంపు, కాలేజీల ఏర్పాటుకు కొన్ని దశాబ్దాలు పడుతుందని ఆగ్రహం వ్యక్తమైంది. వైద్య విద్యలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టిన తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రాల హక్కుల్ని కేంద్రం హరిస్తున్నదని తమిళనాడు సీఎం స్టాలిన్ మండిపడ్డారు. రాష్ట్రాలతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండా కేంద్రం ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవటమేంటని కర్ణాటక ఆరోగ్యమంత్రి శరణ్ ఇటీవల ప్రశ్నించారు.

## 50-70% తగ్గిన క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

- ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో నిరాశాజనకంగా రిక్రూట్‌మెంట్
- ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో ఆచితూచి వ్యవహరిస్తున్న ఐటీ కంపెనీలు



న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులు ఉద్యోగాల కోసం మరికొన్ని నెలలు ఎదురు చూడాల్సిన పరిస్థితులు తప్పేలా లేవు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్లేస్‌మెంట్లు 50-70 శాతం తగ్గిపోయాయి. ఆర్థిక మందగమన పరిస్థితుల నేపథ్యంలో నూతన ఉద్యోగుల నియామకంలో ఐటీ కంపెనీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఆటోమొబైల్, ఏరోనాటిక్స్, బయో టెక్నాలజీ, బయో మెడికల్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ తదితర విభాగాల్లోనూ రిక్రూట్‌మెంట్ తగ్గిపోయిందని కాలేజీలు చెప్తున్నాయి. దీంతో దేశీయ కంపెనీల రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ల కోసం ప్రయత్నించాలని అమిటీ యూనివర్సిటీ నిర్ణయించింది. ఈ సారి ప్లేస్‌మెంట్ల పరిస్థితి నిరాశనకంగా ఉందని కేఎల్ యూనివర్సిటీ సీనియర్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ శరవణబాబు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో గత ఏడాది (2023 బ్యాచ్) తమ యూనివర్సిటీ విద్యార్థులు 80 శాతం మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలు పొందగా ఈఏడాది (2024 బ్యాచ్) 35 శాతం మంది మాత్రమే ఉద్యోగాలకు ఎంపికయ్యారని వెల్లడించారు. ఫ్రెషర్ల ఎంపికలో పరిశ్రమ వర్గాలు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయని శారదా వర్సిటీ వైస్‌ఛాన్సలర్ పర్మానంద్ తెలిపారు. 'గత ఏడాది కొన్ని కంపెనీలు పరిమితికి మించి నియమించుకోవడం కూడా ఈ ఏడాది ప్లేస్‌మెంట్లు తగ్గడానికి కారణం. చాలా కొత్త కంపెనీలు, ముఖ్యంగా స్టార్టప్‌లు ఈ ఏడాది రిక్రూట్‌మెంట్ చేసుకుంటాయి' అని ఓకాలేజీ చీఫ్ ఇండస్ట్రీ ఎంగేజ్‌మెంట్ ఆఫీసర్ అంచనా వేశారు.

- లోయలోపడ్డ బస్సు.. 38 మంది దుర్మరణం



జమ్ము కశ్మీర్‌లో ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. కిష్త్వాడ్ నుంచి జమ్ము వెళ్తున్న బస్సు లోయలో పడింది. ఈ ప్రమాదంలో 38 మంది మృతి చెందగా, 20 మంది గాయపడ్డారు. దోడా జిల్లాలో బుధవారం సుమారు 55 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు బటోట్-కిష్త్వాడ్ జాతీయ రహదారిపై త్రుంగల్-అసాసర్ ప్రాంతంలో 300 అడుగుల లోయలోకి జారి పడింది. ప్రమాదంలో 38 మంది అక్కడికక్కడే మృతి చెందారు.

## కేంద్రానికి కుకీల అల్టిమేటం

**రెండు వారాల్లో ప్రత్యేక పాలనా యంత్రాంగానికి డిమాండ్**

ఇంఫాల్, నవంబర్ 15: మణిపూర్‌లో కుకీ-జో గిరిజనులు మెజార్టీగా ఉండే ప్రాంతాల్లో 'స్వీయ పాలిత ప్రత్యేక పాలన' ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని గిరిజన సంఘం ఇండిజీనస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం(ఐటీఎల్‌ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు బీజేపీ సర్కార్‌కు అల్టిమేటం జారీచేసింది. రెండు వారాల్లో తమ డిమాండ్‌ను పరిష్కరించకుంటే, కేంద్ర ప్రభుత్వ గుర్తింపుతో పనిలేకుండా తమ 'స్వీయ ప్రభుత్వాన్ని' ఏర్పాటు చేసుకొంటామని ఐటీఎల్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి మువాన్ తోంబింగ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో జాతిపరమైన హింస ప్రారంభమై ఆరు నెలలకు పైగా గడిచినా తమ ప్రత్యేక పాలన డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఆమోదించలేదన్నారు. మరోవైపు రాష్ట్రంలో కొనసాగుతున్న హింసలో భాగంగా చోటుచేసుకొన్న గిరిజనుల హత్యలపై సీబీఐ లేదా ఎన్ఐఏ చేత దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తూ చురాచంద్‌పూర్‌లో ఐటీఎల్‌ఎఫ్ ఆందోళనలు నిర్వహించింది. కుకీ-జో వర్గం ప్రజలపై దాడులకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టినట్టు తెలిపింది.

## మధ్యప్రదేశ్‌లో గెలిచేదెవరో?

- ప్రచారానికి తెర.. రేపు ఎన్నికలు
- ఒకే విడతలో 230 నియోజకవర్గాలకు పోలింగ్
- బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత
- కాంగ్రెస్‌కు 'ఇండియా' కూటమి పార్టీల దెబ్బ!






భోపాల్, నవంబర్ 15: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో బుధవారం సాయంత్రంతో ప్రచారం పర్వం ముగిసింది. 230 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతగా శుక్రవారం పోలింగ్ జరుగనున్నది. 230 స్థానాల్లో 2,533 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు. దాదాపు 5.6 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రధాన పోటీ నెలకొన్నది. ఆయా పార్టీలు కీలక నేతలను రంగంలోకి దింపి ప్రచారంతో హోరెత్తించాయి. బీజేపీ తరపున ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఇతర కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు, తదితర నేతలు ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిలో మునిగిపోయాయని, ప్రజాధనాన్ని లూటీ చేశాయని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే విద్యుత్తు కోతలు, నీటి సంక్షోభం, మౌలిక సదుపాయాల లేమి వంటి పరిస్థితులు తలెత్తుతాయని ప్రచారం చేశారు. కాంగ్రెస్ నుంచి ప్రచారం చేపట్టిన ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇతర సీనియర్ నేతలు కుల గణన, ఓబీసీ సంక్షేమం వంటి హామీలను ప్రధానంగా ప్రస్తావించారు.

**వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు..**

ప్రభుత్వం, సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు వెరసి ఓటమి భయంతో బీజేపీ ఈ సారి పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలను బరిలోకి దింపింది. శివరాజ్ సింగ్ చౌహాన్‌పై వ్యతిరేకత నేపథ్యంలో ఆయన్ను సీఎం అభ్యర్థిగా బీజేపీ ఫోకస్ చేసినట్టుగా కనిపించలేదు. కమలం పార్టీ ప్రధానంగా మోదీ చరిష్మానే నమ్ముకొన్నది. కాగా, రాష్ట్రంలో బీజేపీ '50 శాతం కమీషన్' సర్కార్‌ను నడుపుతున్నదని, ధరలు పెచ్చరిల్లిపోయాయని, నిరుద్యోగం పెరిగిందని ప్రతిపక్ష కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేసింది. గత 18 ఏండ్ల బీజేపీ పాలనలో 250కి పైగా మేజర్ స్కామ్‌లు జరిగాయని ఆరోపిస్తూ ఇటీవల ఒక లిస్టు కూడా విడుదల చేసింది. మరోవైపు బీజేపీలో నేతల మధ్య విభేదాలు కలవరపరుస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నేతల తీరుపై మాజీ సీఎం ఉమాభారతి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

**విపక్ష కూటమిలో ఎవరికి వారే!**

కాంగ్రెస్ పరిస్థితి మరో విధంగా ఉన్నది. పార్టీలో నేతలు దిగ్విజయ్, కమల్‌నాథ్ మధ్య విభేదాలు ఉన్నాయి. ఇండియా కూటమిలో మిత్రపక్షాలుగా ఉన్న ఎస్పీ, ఆప్, జేడీయూ వంటి పార్టీలు విడిగా పోటీచేస్తున్నాయి.

## ఛత్తీస్‌గఢ్‌లో రేపు రెండో విడత

**70 అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికలు**

రాయ్‌పూర్, నవంబర్ 15: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ రెండో(తుది) విడత ఎన్నికలు శుక్రవారం జరుగనున్నాయి. 22 జిల్లాల్లోని 70 స్థానాల్లో పోలింగ్ జరుగుతుంది. వీటిలో నక్సల్ ప్రభావిత బింద్రనవాగఢ్ నియోజకవర్గం ఉన్నది. మొత్తంగా 70 స్థానాల్లో 958 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. సీఎం భూపేశ్ బఘేల్ పోటీచేస్తున్న పాటన్ స్థానం ఈ దశలోనే ఉన్నది. దాదాపు 1.63 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 700 'సంగ్వారి' పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందిగా కేవలం మహిళలే ఉంటారని ఓ అధికారి తెలిపారు. ఈనెల 7న మొదటి విడతలో భాగంగా 20 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. రెండో దశ ఎన్నికలకు బుధవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ పెద్దయెత్తున ప్రచారం నిర్వహించాయి.



## టీచర్ల శిక్షణకు ఏడాదికి బిలియన్ డాలర్లు వెచ్చించాలి

బెంగళూరు, నవంబర్ 15: దేశంలోని స్కూల్ టీచర్లకు శిక్షణ కోసం ఏటా బిలియన్ డాలర్లు (సుమారు రూ.8300 కోట్లు) ఖర్చు చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సూచించారు. ఇందుకోసం ఇండియాసహా ప్రపంచంలో 'స్టెమ్' (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) రంగాల్లో విజయవంతమైన రిటైర్డ్ టీచర్లను నియమించుకోవాలని పేర్కొన్నారు. టీచర్లు, రిసెర్చర్లను గౌరవించడంతో పాటు వారికి మెరుగైన వేతనాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. యువతకు వారు రోల్ మాడల్స్ కాబట్టి వారిని గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు ఇందుకోసమే తాము 2009లో 'ఇన్ఫోసిస్ ప్రైజ్'ను ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ)ని పరుగులు పెట్టించాలంటే 'స్టెమ్' రంగంలో రిటైర్ అయిన 10 వేలమందితో 2,500 'ట్రైన్ ద టీచర్' కాలేజీలు ఏర్పాటు చేయాలన్నారు.



## 21,500 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్

కాఠ్మాండూ : భారతీయ స్కైడైవర్, పద్మశ్రీ గ్రహీత శీతల్ మహాజన్(41) మరో రికార్డు నమోదుచేశారు. ఆకాశంలో 21,500 అడుగుల ఎత్తులో, అత్యంత ఎత్తైన శిఖరం మౌంట్ ఎవరెస్ట్ ఎదుట హెలిక్యాప్టర్ నుంచి స్కైడైవింగ్ చేసి చరిత్ర సృష్టించారు. సోమవారం నాటి ఈ ప్రదర్శనతో, ప్రపంచంలో అత్యంత ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసిన మొదటి మహిళగా ఆమె గుర్తింపు పొందారు.



## న్యూయార్క్‌లో బడులకు దీపావళి సెలవు

న్యూయార్క్: అమెరికాలో దీపావళి పండుగకు అరుదైన గుర్తింపు లభించింది. దీపావళి రోజు ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించే బిల్లుపై న్యూయార్క్ గవర్నర్ కాథీ హూచల్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కాథీ హుచల్ మాట్లాడుతూ న్యూయార్క్ సిటీలో ఎన్నో మతాల వాళ్లు కలిసిమెలిసి నివసిస్తున్నారని చెప్పారు. ఈ వైవిధ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు.

## సెకనులో 150 సినిమాలు డౌన్‌లోడ్

**ప్రపంచంలోనే వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఆవిష్కరించిన చైనా**

బీజింగ్, నవంబర్ 15: అద్భుత టెక్నాలజీల ఆవిష్కరణలో శరవేగంగా దూసుకుపోతున్న చైనా, మరో మహాద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను విజయవంతంగా వినియోగంలోకి తెచ్చింది. ఇది ఎంత వేగవంతమైందంటే.. ఒక సెకనులో 150 సినిమాలను డౌన్‌లోడ్ చేయవచ్చు. సెకనులో 1.2 టెరాబైట్ (టీబీ) డాటాను ఈ నెట్‌వర్క్ ద్వారా విజయవంతంగా సరఫరా చేశారు. అంటే సెకనులో 1200 గిగాబైట్ (జీబీ) డాటా అన్నమాట. ప్రపంచంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక ఇంటర్నెట్ టెక్నాలజీ అత్యధికంగా సెకనుకు 100 జీబీ డాటాను మాత్రమే మార్పిడి చేయగలదు. ఇటీవల అమెరికా సెకనుకు 400 జీబీ డాటాను మార్పిడి చేయగల నెట్‌వర్క్‌ను నిర్మించింది. దీంతో పోల్చితే చైనా నెట్‌వర్క్ నాలుగింతలు. ఈ నెట్‌వర్క్ నిర్మాణం కోసం చైనా పదేండ్లుగా పరిశోధన చేస్తున్నది. ఈ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్‌ను బీజింగ్, వుహాన్, గాంగ్‌ఝౌ మధ్య 3000 కిలోమీటర్ల పొడవున ఏర్పాటుచేశారు. సింఘువా యూనివర్సిటీ, హువావే టెక్నాలజీస్, సెర్నెట్ కార్పొరేషన్ కలిసి ఈ అద్భుతాన్ని ఆవిష్కరించినట్టు సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తెలిపింది.



## వ్యక్తిగత జీవితం బాగుంటేనే వృత్తిగతంగా రాణింపు

ముంబై: 'ఇంటి దగ్గర శాంతి లేకపోతే ఆఫీసులోనూ అశాంతే'. ఇది మూడింట రెండొంతుల వృత్తి నిపుణులు అంగీకరిస్తున్న నిజం. గృహ వాతావరణం సరిగ్గా లేకపోతే ఆఫీసులో పని తీరుపై ప్రభావం చూపుతుందని, వృత్తిలో రాణించాలంటే వారికి కుటుంబ సభ్యుల సహకారం తప్పక అవసరమని 69 శాతం మంది పేర్కొన్నట్టు స్టాఫింగ్ సొల్యూషన్స్, హెచ్ఆర్ సర్వీసెస్ ప్రొవైడర్ జీనియస్ కన్సల్టెంట్స్ నిర్వహించిన సర్వే పేర్కొంది.



## 'ఫ్యాక్టర్ ఎక్స్'తో మానవాళి అంతం!

వాషింగ్టన్, నవంబర్ 15: కరోనా వైరస్ మనలో ఎంత భయాన్ని కలిగించిందో అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు మానవాళిని తుడిచి పెట్టేసే అవకాశమున్న 'ఫ్యాక్టర్ ఎక్స్' ప్రాణాంతక వైరస్ పునరుద్ధరణ జరగొచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ధ్రువ ప్రాంతాల్లో మంచు పలకల కింద వేలాది ఏండ్ల క్రితం నిక్షిప్తమైన వైరస్‌లు ఇప్పుడు భూతాపం కారణంగా బయటకు రావచ్చని వారు అంచనా వేస్తున్నారు.